తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT









సంపుటి: 1 సంచిక: 67 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ బుధవారం 9-10-2024 వెల: 5/రూ -




# హర్యానాలో కాంగ్రెస్‌కు షాక్

## 48 సీట్లతో మరోసారి అధికారంలోకి.. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులు

- అనూహ్యంగా హ్యాట్రిక్ సాధించిన బీజేపీ
- ఫలితాలను అంగీకరించమన్న హస్తం పార్టీ
- జమ్ముకశ్మీర్‌లో ఇండియా కూటమి జయకేతనం
- 3 రాష్ట్రాల్లో ప్రజలను వంచించిన ఫలితం
- కాంగ్రెస్‌ను ఈడ్చికొట్టిన హర్యానా ఓటర్
- ఏడు గ్యారెంటీలతో ఏమార్చాలనుకొన్న
- హస్తానికి దిమ్మదిరిగిపోయేలా జవాబు
- కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ఎఫెక్ట్‌తో అప్రమత్తమై..
- ఎవరూ ఊహించని తీర్పు



చండీగఢ్: హర్యానాలో కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. పదేండ్ల తర్వాత మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని కలలు కన్న ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. రైతులు, రెజ్లర్ల పోరాటం, పదేండ్ల బీజేపీ పాలనపై ఉండే ప్రభుత్వ వ్యతిరేకతతో ఈసారి గెలుపు ఖాయమనుకున్న చోట హస్తం పార్టీ బొక్కబోర్లా పడింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ మూడోసారి అధికారాన్ని కైవసం చేసుకుంది. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన మొదట్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఫలితాల సరళి కనిపించింది. కానీ, బీజేపీ అనూహ్యంగా పుంజుకొని మ్యాజిక్ ఫిగర్‌ను దక్కించుకుంది. 90 సీట్లకు గానూ ఆ పార్టీకి 48 సీట్లు దక్కగా, కాంగ్రెస్ పార్టీ 37 సీట్లకు పరిమితమైంది. స్వతంత్రులు

2లో

# రాజకీయ లబ్ధికి మా పరువు తీశారు

## మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం కేసులో హీరో నాగార్జున వాంగ్మూలం



కోర్టులు: రాజకీయ లబ్ధి కోసమే మంత్రి కొండా సురేఖ తమ కుటుంబంపై తప్పుడు వ్యాఖ్యలు చేశారని సినీ నటుడు నాగార్జున నాంపల్లి కోర్టులో పేర్కొన్నారు.

2లో

# విద్యుత్‌శాఖలో ఖాళీలు భర్తీ చేస్తాం

- దసరా కన్నా ముందేఅన్ని పెండింగ్ బిల్లుల విడుదల
- కేబినెట్‌లో చర్చించాకే మూసీపై నిర్ణయం..
- ఖమ్మంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



# కమలం ఖుషీ



- ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి మూడోసారి విజయం
- హరియాణాలో 90 సీట్లకుగాను 48 స్థానాల్లో బీజేపీ గెలుపు
- 37 స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్.. ఖాతా తెరవని ఆప్
- లెక్కింపులో తొలుత కాంగ్రెస్ జోరు.. తర్వాత పుంజుకున్న బీజేపీ
- కాంగ్రెస్ భస్మాసుర హస్తం.. కుమ్ములాటలతో గెలుపు దూరం
- హస్తంవైపు జాట్లు.. దాంతో బీజేపీవైపునకు జాటేతర వర్గాలు!

2లో

# తెలంగాణలో వైఫల్యంతోనే హరియాణాలో కాంగ్రెస్ ఓటమి

- డొల్ల గ్యారంటీల గారడీని ప్రజలు తిరస్కరించారు: కేటీఆర్
- కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారు
- బీజేపీని ఢీకొనే సత్తా ప్రాంతీయ పార్టీలకే ఉందని స్పష్టమైంది
- 2029లో కేంద్రంలో బలమైన ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర అని వ్యాఖ్య

హైదరాబాద్: "కర్ణాటకలో ఐదు గ్యారంటీలు, తెలంగాణలో ఆరు గ్యారంటీల పేరిట డొల్ల హామీలతో ప్రజలను నిలువునా మోసం చేసిన కాంగ్రెస్.. హరియాణాలోనూ ఏడు గ్యారంటీల పేరిట మభ్యపెట్టాలని చూసింది. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లలో గ్యారంటీల పేరిట కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారు.



# ఎస్సీ వర్గీకరణకు వన్‌మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్

- సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో ఏర్పాటు
- వర్గీకరణ అధ్యయనంపై కాలపరిమితి తప్పనిసరి
- 2011 జనగణన గణాంకాల ఆధారంగా వర్గీకరణకు చర్యలు
- వర్గీకరణ కమిటీ ఆధ్వర్యంలో త్వరలో జిల్లాలవారీగా పర్యటనలు
- మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్: రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వర్గీకరణ ప్రక్రియను అధ్యయనం చేసేందుకు వన్‌మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని వర్గీకరణ కోసం



## ఎస్సీ వర్గీకరణకు వన్‌మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం (కేబినెట్ సబ్ కమిటీ) నిర్ణయించింది. చట్ట సంబంధ చిక్కుల్లేకుండా అత్యంత పారదర్శ కంగా కమిషన్ అధ్యయనం చేయాలని కమిటీ తీర్మానించింది. కమిషన్‌కు చైర్మన్‌గా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తిని నియమించాలని నిర్ణయం తీసుకుంది. కమిషన్ ఏర్పాటుకు ఇప్పటికే అడ్వొకేట్ జనరల్ (ఏజీ) నుంచి మంత్రివర్గ ఉపసంఘానికి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ముసా యిదా సైతం అందింది. ఈ నేపథ్యంలో పలు సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. ఎస్సీ వర్గీకరణ కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు కావడం తెలిసిందే. ఈ కమిటీ మంగళవారం సచివాలయంలో భేటీ అయింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ సీతక్క, పార్లమెంటు సభ్యులు మల్లు రవితోపాటు సీఎస్ శాంతికుమారి, ఏజీ సుదర్శన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

**ఆర్థిక శాఖ నుంచి 30%సమాచారం: ఉత్తమ్**

రాష్ట్రంలో వర్గీకరణ ప్రక్రియను 2011 జనగణన ఆధారంగా చేపట్టాలని కమిటీ దాదాపు నిర్ణయించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు రాష్ట్రంలోని ఉద్యోగ నియామక బోర్డుల నుంచి ఎస్సీ ఉపకులాలవారీగా నియామకాల సమాచారాన్ని స్వీకరించామని, ఆర్థిక శాఖ నుంచి 30 శాతం సమాచారం వచ్చిందని మంత్రి ఉత్తమ్ వివరించారు. గత నెల 30 నుంచి విజ్ఞాపనల స్వీకరణ ప్రారంభించగా ఇప్పటివరకు 1,082 సూచనలు వచ్చినట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్న పంజాబ్, తమిళనాడులలో అధికారుల బృందం అధ్యయనం చేసిందని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో హరియాణాలో అధ్యయనం చేయలేదన్నారు. పంజాబ్‌లో ఎస్సీ కేటగిరీలో రెండు గ్రూపులుగా వర్గీకరణ చేశారని, తమిళనాడులో విద్య, ఉపాధిలో ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, ఆ రాష్ట్రంలో 76 ఎస్సీ ఉపకులాలు ఉన్నట్లు ఉత్తమ్ వివరించారు. ఆ రెండు రాష్ట్రాల్లో వర్గీకరణ ప్రక్రియ చట్టపరమైన చిక్కుల్లేకుండా అమలు చేసేందుకు వన్‌మెన్ కమిషన్ ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావించారు.

## రాజకీయ లబ్ధికి మా పరువు తీశారు

ఆమె చేసిన వ్యాఖ్యలన్నీ అవాస్తవాలేనని.. వాటిలో ఎలాంటి నిజం లేదన్నారు. మంత్రిపై వేసిన క్రిమినల్ పరువునష్టం కేసు విచారణలో భాగంగా మంగళవారం నాగార్జున తన సతీమణి అమల, కుమారుడు నాగచైతన్యతో కలిసి నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎక్సైజ్ కోర్టుకు హాజరయ్యారు. జడ్జి ఎస్.శ్రీదేవి ఎదుట ఈ మేరకు వాంగ్మూలం ఇచ్చారు. నాలుగు దశాబ్దాలుగా గౌరవప్రదంగా జీవిస్తున్నా అక్కినేని వారసుడిగా తెలుగు చిత్ర పరిశ్రమలో నాలుగు దశాబ్దాల గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగిస్తున్నానని నాగార్జున కోర్టుకు తెలిపారు. నటుడిగా, నిర్మాతగా, టీవీ వ్యాఖ్యాతగా, స్టూడియో యజమానిగా తాను, తన కుటుంబం ప్రజల ఆద రాభిమానాలు పొందుతున్నామన్నారు. తన కుమారుడు నాగచైతన్య సైతం సినీ నట వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రేక్షకుల ప్రశంసలు పొందుతున్నాడ న్నారు. కానీ తన కుమారుడి వైవాహిక జీవితాన్ని ఉద్దేశించి కొండా సురేఖ మాట్లాడిన మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించాయని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, పేపర్ క్లిప్పింగ్‌ల వల్ల తమ కుటుంబం పరువు పోయిందని.. తాము ఎంతో కలత చెందామని చెప్పారు.

# తెలంగాణలో వైఫల్యంతోనే హరియాణాలో కాంగ్రెస్ ఓటమి



(మొదటి పేజీ తరువాయి)

దీనికి హరియాణాలో ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించడమే నిదర్శనం.."అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సందర్భంగా ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా గ్యారంటీలు ప్రకటిస్తూ వచ్చిన కాంగ్రెస్.. చివరికి బొక్క బోర్లా పడిందని విమర్శించారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులు చిత్తు కాగితంలా మారాయని, అలవి కాని హామీలతో గద్దెనెక్కాలని భావించిన కాంగ్రె స్‌కు జనం కర్రు కాల్చి వాత పెట్టారని పేర్కొ న్నారు.తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రజల కు కాంగ్రెస్ గ్యారంటీల డొల్లతనం పూర్తిగా అర్థమైందని.. రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలన వైఫల్యాలే హరియాణాలో ఓటమికి దారితీశాయని విమ ర్శించారు. సోషల్ మీడియా విస్తృతి పెరుగు తున్న ప్రస్తుత సమయంలో ప్రజల నుంచి వాస్తవాలు దాచడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌తో ముఖాముఖి పోరు ఉన్న రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తోందని.. రాహుల్ బలహీన నాయక త్వం కూడా కాంగ్రెస్ ఓటమికి కారణ మని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీజేపీని ఢీకొని నిలువరించే శక్తి కేవలం ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రస్తుత ఫలితాల సరళిని బట్టి 2029లో కేంద్రంలో జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌కు మెజారిటీ సాధ్యం కాదని.. బలమైన ప్రాంతీయ పార్టీలే కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. దేశంలో సమాఖ్య స్ఫూర్తిని, సమగ్రతను, సెక్యులరిజాన్ని కాపాడాలని కోరుకునే మేధావులు, ప్రజలంతా ప్రాంతీయ పార్టీలకు మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో బుల్డోజర్‌రాజ్, పార్టీ ఫిరాయింపులు, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే వ్యవహారాలు నడుస్తున్నా రాహుల్ గాంధీ చూసీ చూడనట్టు వ్యవహరించిన తీరును దేశం మొత్తం గమనిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులకు ప్రజాక్షేత్రంలో కాలం చెల్లిందనే విషయాన్ని ఇప్పటికైనా కాంగ్రెస్ గుర్తుపెట్టుకోవాలని వ్యాఖ్యానించారు.

**పండుగ పూట పస్తులు**

రాష్ట్రంలో కాంగ్రెస్ దండగగా మారి పాలనలో పండుగ పూట కూడా పస్తులు తప్పడం లేదని.. ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదారు నెలలుగా వేతనాలు లేవని కేటీఆర్ ఆరోపించారు. పంచాయతీ, మున్సిపల్ కార్మికులు, ఆస్పత్రుల సిబ్బంది, హాస్టల్ వర్కర్స్, గెస్ట్ లెక్చరర్స్ మొదలుకుని ప్రతీ ప్రభుత్వ శాఖలో వేతనాల్లేక చిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఒకటో తారీఖునే జీతాలు ఇస్తామని ప్రభుత్వం ప్రగల్భాలు పలికిందని.. దసరా పండుగ వచ్చినా చిరుద్యోగుల చేతిలో చిల్లిగవ్వ లేదని విమర్శించారు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే.. చిరుద్యోగుల బతుకు బండి ఎలా సాగుతుందని కేటీఆర్ ప్రశ్నించారు.

# హర్యానాలో కాంగ్రెస్‌కు షాక్

ముగ్గురు, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్ఎల్‌డీ) నుంచి ఇద్దరు విజయం సాధించారు. ఆప్ ఒక్క స్థానాన్నీ గెలవలేదు. గత ఎన్నికల్లో బీజేపీ 41 సీట్లు గెలవగా(2022 అదంపూర్ ఉప ఎన్నిక సహా) ఈసారి ఏడు స్థానాలను పెంచుకుంది. గత ఎ్నకల్లో కాంగ్రెస్ 28 సీట్లు గెలవగా, ఈసారి తొమ్మిది స్థానాలు ఎక్కువ వచ్చాయి. లద్వా నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ 16 వేల మెజారిటీతో గెలిచారు. కాంగ్రెస్ కీలక నేత భూపిందర్ సింగ్ హుడా, హిసార్ నుంచి స్వతంత్ర అభ్యర్థి, దేశంలోనే ధనవంతురాలు సావిత్రి జిందాల్ విజయం సాధించారు. జులానా నుంచి మొదటిసారి బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి, రెజ్లర్ వినేశ్ ఫోగట్ 6,015 ఓట్ల తేడాతో ప్రత్యర్థి యోగేశ్ కుమార్‌పై గెలుపొందారు. ఐఎన్ఎల్‌డీ కీలక నేత అభయ్ చౌతాలా ఓటమి చవిచూశారు. జన్‌నాయక్ జనతా పార్టీ(జేజేపీ) నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి దుశ్యంత్ చౌతాలా సైతం ఓడిపోయారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఎగ్జిట్ పోల్స్ సంస్థలేవీ సరిగ్గా అంచనా వేయలేకపోయాయి. స్థానిక సర్వే సంస్థలు మొదలు జాతీయ స్థాయిలో పేరుమోసిన సంస్థల వరకు అన్నీ ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ వస్తుందని 50-70 సీట్లు రావొచ్చని చెప్పాయి. కానీ, అనూహ్యంగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ మరోసారి అధికారాన్ని దక్కించుకుంది. మాజీ ఉప ప్రధాని దేవీలాల్ కుటుంబం ఈ ఎన్నికలతో హర్యానా రాజకీయాల్లో పూర్తిగా పట్టు కోల్పోయింది. దేవీలాల్ తనయుడు ఓంప్రకాశ్ చౌతాలా నేతృత్వంలోని ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ పార్టీకి రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆదరణ ఉండేది. 2018 వరకు హర్యానా రాజకీయాల్లో ఐఎన్ఎల్‌డీ ప్రభావం ఉండేది. చౌతాలా కుటుంబంలో విభేదాలతో ఓంప్రకాశ్ చౌతాలా పెద్ద కుమారుడు అజయ్ సింగ్ చౌతాలా జన్‌నాయక్ జనతా పార్టీని స్థాపించారు. 2019 ఎన్నికల్లో ఈ పార్టీ 10 సీట్లు సాధించింది. ఆ ఎన్నికల్లో బీజేపీకి మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో జేజేపీ కింగ్‌మేకర్ అయ్యింది. అజయ్ సింగ్ చౌతాలా కుమారుడు దుశ్యంత్ చౌతాలా ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. లోక్‌సభ ఎన్నికల ముందు బీజేపీతో జేజేపీ పొత్తు విచ్ఛిన్నమైంది. ఈ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన జేజేపీ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేదు. దుశ్యంత్ చౌతాలా సైతం ఓడారు. ఐఎన్ఎల్‌డీ రెండు స్థానాలకే పరిమితమైంది. హర్యానా ముఖ్యమంత్రిగా మరోసారి నాయబ్ సింగ్ సైనీ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. కొన్ని నెలల ముందే మనోహర్‌లాల్ ఖట్టర్‌ను సీఎం పదవి నుంచి తప్పించి సైనీకి బీజేపీ హైకమాండ్ పగ్గాలు అప్పగించింది. ఓబీసీ నాయకుడైన సైనీ సారథ్యంలో బీజేపీ హర్యానాలో అనూహ్యంగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. దీంతో మరోసారి సైనీకే సీఎం బాధ్యతలు అప్పగించాలని బీజేపీ నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

**ఉదయం స్వీట్లు.. మధ్యాహ్నానికి పాట్లు**

హర్యానా ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కాంగ్రెస్ విచిత్ర పరిస్థితులను ఎదుర్కొన్నది. లెక్కింపు ఆరంభంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా ట్రెండ్స్ ఉండటంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. కార్యకర్తలు స్వీట్లు పంచుకొని, డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేశారు. అయితే, కొద్దిసేపటికే ఫలితాల సరళి బీజేపీకి అనుకూలంగా మారడంతో ఉసూరుమన్నారు. కాగా, ఓట్ల లెక్కింపుపై కాంగ్రెస్ నేతలు అనుమానాలు వ్యక్తం చేశారు. మ్యానిపులేషన్ ద్వారా బీజేపీ హర్యానాలో గెలిచిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. 14 నియోజకవర్గాల్లో ఈవీఎంల పనితీరు, లెక్కింపు ప్రక్రియపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. తమ గెలుపును లాక్కున్నారని, ఈ ఫలితాలను అంగీకరించలేమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తప్పుబట్టింది.

## కమలం ఖుషీ

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ కొట్టింది! ప్రీ పోల్, పోస్ట్ పోల్, ఎగ్జిట్ పోల్ అంచనాల్ని తలకిందులు చేస్తూ.. రాజకీయ నిపుణుల విశ్లేషణలను అబద్ధం చేస్తూ.. ముచ్చటగా మూడోసారి విజయం సాధించింది! మంగళవారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలైన తర్వాత కొంతసేపటి వరకూ కాంగ్రెస్ జోరు కనిపించినా.. బీజేపీ క్రమంగా పుంజుకుని రేసులో ముందుకు దూసుకుపోయింది.మొత్తం 90 సీట్లకుగాను.. 48 స్థానాల్లో విజయఢంకా మోగించి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూలు వెలువడినప్పటి నుంచి ఎగ్జిట్ పోల్స్ దాకా.. ప్రతి దశలోనూ గెలుపుపై ధీమాతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేవలం 37 సీట్లకు పరిమితమై మరోసారి ఓటమి చేదును చవిచూసింది. ఐఎన్ఎల్‌డీ రెండు సీట్లతో సరిపెట్టుకోగా.. కాంగ్రెసతో పొత్తు కుదరక సొంతంగా పోటీ చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ డకౌట్ అయిపోయింది! ఇక.. గత ఎన్నికల్లో 10 సీట్లు సాధించి కింగ్ మేకర్ పాత్ర పోషించిన జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ) ఈసారి ఒక్క సీటు కూడా సాధించలేక చతికిలపడింది! సాక్షాత్తూ ఆ పార్టీ అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలా దారుణాతిదారుణంగా ఓడిపోయారు. ఇక.. ఈ ఎన్నికల్లో పోటీ చేసి అందరి దృష్టినీ ఆకర్షించిన వినేశ్ ఫొగట్, సావిత్రి జిందాల్ గెలుపొందడం విశేషం. కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన వినేశ్ తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి యోగేశ్ కుమార్‌పై 6,015 ఓట్ల తేడాతో గెలిచారు. భారతదేశంలోనే అత్యంత సంపన్న మహిళ అయిన సావిత్రి జిందాల్.. హిసార్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఇంత సంతోషంలోనూ బీజేపీకి అసంతృప్తి కలిగించే విషయం.. ఆ పార్టీకి చెందిన 8 మంది మంత్రులు, స్పీకర్ ఓడిపోవడం. అటు హరియాణా కాంగ్రెస్ చీఫ్ ఉదయ్ భాన్, ఐఎన్ఎల్‌డీ చీఫ్ అభయ్ సింగ్ చౌతాలా కూడా ఓడిపోవడం గమనార్హం. కాగా.. 1966లో ఏర్పాటైన



హరియాణాలో ఒక పార్టీ వరుసగా మూడోసారి గెలవడం ఇదే!

**కాంగ్రెస్ స్వయంకృతం**

హరియాణాలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీపై సహజంగా ఏర్పడిన వ్యతిరేకత, జాట్ సామాజికవర్గంలో ప్రభుత్వంపై నెలకొన్న ఆగ్రహం, దేశానికి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని తెచ్చిపెట్టిన క్రీడాకారుల్లో కొందరు రాజకీయ ఆరంగేట్రం చేసి కాంగ్రెస్ పక్షాన నిలబడడం, రైతు ఆందోళనలు, పెరిగిన ధరలు, నిరుద్యోగం, అగ్నివీర్ పథకంపై అసంతృప్తి వంటి అనేక పరిణామాల నేపథ్యంలో.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమనే ప్రచారం విస్తృతంగా జరిగింది. అయితే.. ప్రభుత్వ వ్యతిరేకతను తనవైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వంలో వర్గపోరు వారి గెలుపు అవకాశాలకు దూరం చేసింది. జాట్ వర్గం నేత భూపిందర్ సింగ్ హుడాకు దళిత వర్గం నేత కుమారి సెల్జాకు మధ్య విబేధాలు ఎన్నికల్లో స్పష్టంగా కనిపించాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం హుడాకు పూర్తి స్వేచ్ఛనివ్వడంతో రాష్ట్రంలోని మొత్తం 90 స్థానాల్లో 70 సీట్లు తన వర్గంవారికే ఇచ్చుకున్నారని.. ఇది కుమారి సెల్జాకే కాక, జాట్ వర్గానికే చెందిన రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలాకు సైతం మింగుడుపడలేదని చెబుతున్నారు. దీంతో, ఎవరికి వారు రెబల్ అభ్యర్థులను నిలబెట్టడంతో పార్టీకి నష్టం వాటిల్లింది.

## విద్యుత్‌శాఖలో ఖాళీలు భర్తీ చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఖమ్మం: 'విద్యుత్ శాఖలో పదేళ్లు గా ప్రమోషన్లు పెండింగ్‌లో ఉండగా, మా ప్రభుత్వమే ఇచ్చి0ది. ఎవరూ అడగక ముందే దీనిపై నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం ఈ శాఖలో ఖాళీల కారణంగా ఉన్న వారిపై పనిభారం పడు తోంది. నెల,రెండు నెలల్లో వీటి భర్తీకి నోటిఫికేషన్ ఇస్తాం'అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్ర మార్క వెల్లడించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల అధికారుల తో విద్యుత్, సంక్షేమ శాఖలపై మంగళవారం ఆయన సమీక్షించారు. అనంతరం విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు. వరదల సమయంలో విద్యుత్ ఉద్యోగులు ఎంతో కష్టపడి పనిచేశారని భట్టి అభినందించారు. అయితే శాఖలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉద్యోగ వ్యవస్థ అందుబాటులోకి రావాల్సి ఉందని, 20 నుంచి 30 ఏళ్లుగా పనిచేస్తున్న వారికి హైదరాబాద్‌లోని స్టాఫ్ కాలేజీలో శిక్షణ ఇస్తామని తెలిపారు. విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య వచ్చినా వినియోగదారులు 1912కు కాల్ చేయొచ్చని, 108 లాగే ఇది కూడా ఉపయోగపడుతుందన్నారు. పేరు, అడ్రస్ చెబితే అక్కడ సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేస్తారని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు గోదావరి పరీవాహక ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్లు ఉన్నందున ఉద్యోగులు చిన్నలోపం కూడా ఎదురుకాకుండా చూడాలన్నారు. మరమ్మతులు చేసిన కొన్నాళ్లకే టాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నందున, వ్యవస్థలను తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ రికార్డుల అప్‌డేట్ అంటూ.. గత పాలకులు బినామీల పేర్లపైకి భూములను బదలాయించారని భట్టి ఆరోపించారు. తాము మాత్రమే ఆక్రమణకు గురైన చెరువులను సరిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ఒక్కరే నిర్ణయాలు తీసుకునేవారని, అందుకే మూసీ అంశాన్ని కేబినెట్‌లో చర్చించారా అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారన్నారు. మూసీపై కేబినెట్‌లో చర్చించడానికి కొత్త అంశమేమీ కాదన్నారు. మూసీని శుభ్రం చేసి నగరం నడి'డ్డున స్వచ్ఛమైన నది ప్రవహించేలా సుందరీకరణ చేయబోతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మూసీని సుందరీకరణ చేస్తామని చెప్పి చేయలేదని, తాము చేసి చూపిస్తామని, నిర్వాసితులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగనివ్వమన్నారు. మూసీ ప్రక్షాళనకు డీపీఆర్‌లు సిద్ధం కాకముందే రూ.1.50 లక్షల కోట్లు వ్యయమవుతుందని చెప్పడం సరికాదని చెప్పారు. తాము గడీల్లో లేమని, ఎవరైనా ఎప్పుడైనా వచ్చి సలహాలు ఇవొచ్చని భట్టి తెలిపారు.




# కలెక్టరేట్ ఆవరణలో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ప్రదర్శన

**కరీంనగర్, అక్టోబర్ 08(డైలీ రిపోర్ట్):** చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఆవరణలో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ప్రదర్శనను ని కలెక్టరేట్ కలెక్టర్ పమేలా సత్పతి అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్ లు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగం అపారమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తోందన్నారు. చేనేత నేత నాణ్యమైన ఉత్పత్తులు ఉంటాయి అని, ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని అన్నారు.

## మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన
# సిబిఐటి కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకట నరసింహులు



**శంకర్‌పల్లి: అక్టోబర్ 08: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో మంగళవారం గండిపేటలోని సిబిఐటి ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకట నర్సింలు దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు అనంతరం ఆలయ ప్రధాన పూజారి సాయి శివ వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మరకత లింగాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం అని పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు సదానందం గౌడ్.. ప్రిన్సిపాల్ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోపాల్ ఉన్నారు.

# కొత్త టీచర్లకు నేడు నియామక పత్రాలు

**ఎల్‌బీ స్టేడియంలో అట్టహాసంగా కార్యక్రమం**

**జిల్లాల నుంచి నూతన ఉపాధ్యాయుల తరలింపు... సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు**



హైదరాబాద్: ఎట్టకేలకు 10 వేల మంది వరకూ రాష్ట్ర విద్యాశాఖలో ఉపాధ్యాయులుగా చేరబోతున్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వీరికి బుధవారం నియామక ఉత్తర్వులు నేరుగా అందించనున్నారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో సాయంత్రం 4 గంటలకు పెద్దఎత్తున జరిగే ఈ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమ ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఎంపికైన కొత్త టీచర్లకు సంబంధిత జిల్లా కేంద్రాల డీఈవోల నుంచి ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఉదయం డీఈవో ఆఫీసుకు రావాలని కోరారు. జిల్లాల నుంచి రవాణా సౌకర్యం ఏర్పాటు చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ స్కూళ్లలో ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, ఇతర టీచర్లు కలిపి మొత్తం 11,062 పోస్టుల భర్తీకి మార్చి 1న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ పరీక్షకు 2.45 లక్షల మంది హాజరయ్యారు. జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకూ ఆన్‌లైన్ విధానంలో డీఎస్సీ నిర్వహించారు. సెప్టెంబర్ 30న డీఎస్సీ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేశారు. ప్రతి పోస్టుకు ముగ్గురు చొప్పున ఎంపిక చేసి, జిల్లా



**శంకర్‌పల్లి నుండి పటాన్ చెరు ఎల్లమ్మ తల్లి ఆలయం వరకు పాదయాత్ర**

**శంకర్‌పల్లి: అక్టోబర్ 08: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని హనుమాన్ మందిర్ నుండి పటాన్ చెరు ఎల్లమ్మ తల్లి మందిరం వరకు దుర్గామాత భక్తులు మంగళవారం పాదయాత్ర చేశారు. అనంతరం జై భవాని యూత్ సభ్యులు ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాదయాత్ర చేసిన వారిలో మాజీ ఉప సర్పంచ్ దండు సంతోష్, త్రిషుల్, ప్రశాంత్, సాయి కిషోర్ గౌడ్, సోను, సంతోష్,సూర్య, దేవా,శివ, నాని, చింటూ ఉన్నారు.

# ఏసీబీ వలలో మేడ్చల్ ఏఎస్ఐ

**స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ. 2 లక్షలు డిమాండ్**

**రూ. 50 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు**

మేడ్చల్‌రూరల్: స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ. 2 లక్షలు డిమాండ్ చేసిన ఏఎస్ఐని ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్‌కు చెందిన శర్మ మేడ్చల్ మండలం, గౌడవెల్లి గ్రామ పరిధిలోని సాకేత్ ప్రణమ్‌లో విల్లా కొనుగోలు చేశాడు. అందులో ఇంటీరియర్ పనుల కోసం సరూర్‌నగర్‌కు చెందిన విశ్వనాథ్‌తో రూ.8 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.4 లక్షలు చెల్లించాడు. సగం పనులు పూర్తి చేసిన విశ్వనాథ్ మిగిలిన డబ్బులు ఇవ్వాలని కోరగా, అందుకు శర్మ నిరాకరించడంతో విశ్వనాథ్ పనులు నిలిపివేశాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో శర్మ రెండు నెలల క్రితం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో విశ్వనాథ్‌పై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నార్సింగిలో అతడిని అదుపులోకి తీసుకుని మేడ్చల్ పీఎస్‌కు తీసుకువచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఏఎస్ఐ మధుసూదన్ స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు, ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు విశ్వనాథ్‌ను రూ.2 లక్షలు డిమాండ్ చేశాడు. అందులో భాగంగా మొదట రూ.10 వేలు తీసుకున్నాడు.

# పండుగ తర్వాత బలవంతంగా ఖాళీ చేయించేలా అధికారుల వ్యూహం?

**రెడ్ మార్క్ ఇండ్ల యజమానులను ఒప్పించలేకపోతున్న అధికారులు**

**తమ ఇండ్లు కూల్చనివ్వబోమంటున్న బాధితులు**



ప్రభుత్వం మూసీ నివాసితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. ఈ నేపథ్యంలో మూసీ వెంట తమ రెక్కల కష్టంతో నిర్మించుకున్న ఇండ్లకు అధికారులు రెడ్ మార్క్ వేశారు. ప్రస్తుతానికి కూల్చివేతల ప్రక్రియకు విరామం ఇచ్చినా%ొ% దసరా తరువాత ఎలాగైనా కూల్చివేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. కాగా, మూసీ నిర్వాసితులు అదే స్థాయిలో తమ ఇండ్లను కూల్చనివ్వబోమంటూ శపథం చేస్తున్నారు. అయితే రివర్ బెడ్ కూల్చివేతలే సమస్యగా మారడంతో బఫర్ జోన్ జోలికొస్తే నిర్వాసితులను ఎదుర్కోవడం కష్టమేనని అధికారులు చర్చించుకుంటున్నారు. కూల్చివేతలతో మూసీ నిర్వాసితులను బెంబెలెత్తించిన అధికారులు ఆ దమనకాండకు కాస్త బ్రేకులేశారు. దసరా సెలవుల దృష్ట్యా ఇండ్ల కూల్చివేతలు, ఇప్పటికే కూల్చేసిన నిర్మాణాల శిథిలాల తరలింపు, రెడ్ మార్క్ ఇండ్లను కూల్చివేసే ప్రక్రియలన్నింటికీ అధికారులు విరామం ఇచ్చినట్టు తెలిసింది. ముఖ్యంగా సైదాబాద్ మండలంలో 72 ఇండ్లకు రెడ్ మార్క్ వేసిన అధికారులు ఆ ఇంట్లో ఉంటున్న వారికి డబుల్ బెడ్‌రూంలు అందిస్తామని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే అందులో చాలా వరకు తమ రెక్కల కష్టంతో నిర్మించిన ఇండ్లను కూల్చొద్దంటూ అధికారులకు తేల్చి చెప్పారు. దీంతో సైదాబాద్ నిర్మాణాలను తొలగించడం అధికారులకు సవాల్‌గా మారింది. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి కూల్చివేతలు తప్పవంటూ తన ప్రసంగాల్లో హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు రెడ్ మార్క్ వేసిన ఇండ్లను బలవంతంగానైనా కూల్చేసేలా వ్యూహాలకు పదును పెడుతున్నట్టు సమాచారం. దసరా సెలవుల తర్వాత ఈ వ్యూహం అమలు చేయబోతున్నారని తెలిసింది. కాగా, మూసీ నిర్వాసితులు సైతం తమ ఇండ్లను కూల్చనివ్వబోమంటూ శపథం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలన దుర్మార్గంగా ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, జిల్లాలో రివర్‌బెడ్ నిర్మాణాలు 1595 ఉన్నట్టు అధికారులు తెలిపారు. అత్యధికంగా నాంపల్లి, బహదూర్‌పురలో ఉన్నట్టు వివరించారు. మూసీ నిర్వాసితులకు బతుకమ్మ సంబురాలు కూడా లేవని పలువురు నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే హిమాయత్‌నగర్‌లోని మూసానగర్, శంకర్ నగర్‌లో 150 ఇండ్లను అధికారులు నేలమట్టం చేశారు. వారందరినీ డబుల్ బెడ్ రూం ఇండ్లకు తరలించినట్టు అధికారులు వివరించారు. అయితే వీరిలో ఏ ఒక్కరూ కూడా తమ ఇల్లును కూల్చడానికి అంగీకరించలేదు. అధికారుల భయభ్రాంతుల మధ్య ఇండ్లను బలవంతంగా ఖాళీ చేయాల్సిన దుస్థితి తమదని కొందరు వాపోయారు. ఇప్పుడు ఈ భయం రివర్ బెడ్ దాటి బఫర్ జోన్ వరకు విస్తరించింది. ఇటీవల సీఎం బఫర్ జోన్ నిర్మాణాలను సైతం తొలగించాల్సిందేనని ప్రకటించడంతో అధికారులు ఆ మేరకు కూడా ప్రణాళికలు చేస్తున్నారు. సద్దుల బతుకమ్మ, దసరా సంబురం.. మూసీ నిర్వాసితుల ప్రాంతాల్లో పెద్దగా కనిపించడం లేదు. తమ గూడు పోతుందనే భయంలోనే వాళ్లంతా ఉన్నారు. మరోవైపు తమ ఇండ్లు కోల్పోయిన ప్రాంతాల్లోనే తమకు ఇండ్లు ఇవ్వాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ దొరికే పనిపై ఆధారపడిన తమ బతుకులను వేరే ప్రాంతానికి తరలిస్తే ఎలా బతికేది అంటూ ఆందోళన చెందుతున్నారు.

# ఉపసంఘం పేరిట కాలయాపన

హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉపసంఘం పేరిట కాంగ్రెస్ సర్కార్ కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. రైతులను మోసగించిన తరహాలో మాదిగలను కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని వారు మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో మంగళవారం మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యతో కలసి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, సుంకె రవిశంకర్, పార్టీ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాలకంటే ముందుగానే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తానని అసెంబ్లీ సాక్షిగా సీఎం ఉత్తర కుమార ప్రగల్బాలు పలికారన్నారు. లోక్‌సభ ఎంపీ టికెట్లు, మంత్రివర్గంలో మాదిగలకు ప్రాతినిథ్యం లేకుండా పోయిందని రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు కాంగ్రెస్ పార్టీ అనుకూలంగా పనిచేస్తోందని ఆరోపించారు. సుంకె రవిశంకర్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తే డీఎస్సీ తాజా నియామకాల్లో 1,200 ఉద్యోగాలు మాదిగ సామాజికవర్గానికి దక్కేవన్నారు. సీఎం రేవంత్‌కు హైడ్రాపై ఉన్న ప్రేమ మాదిగలపై లేదని, ఆయన మాదిగ ద్రోహిగా మారారని మండిపడ్డారు. రాష్ట్రంలో మాదిగలకు

# ఎస్టీ వర్గీకరణ ఇప్పట్లో లేనట్లే!

**ఈ దిశగా కసరత్తు మొదలుపెట్టని రాష్ట్ర ప్రభుత్వం**

**ఎస్సీ వర్గీకరణపై మాత్రం వన్‌మెన్ జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటుకు కమిటీ సిఫార్సు**

హైదరాబాద్: రాష్ట్రంలో షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) వర్గీకరణ ప్రక్రియ ఇప్పట్లో ముందుకు కదిలే అవకాశం కనిపించట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వర్గీకరణ కోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేయగా.. ఆ కమిటీ మాత్రం కేవలం ఎస్సీ వర్గీకరణపైనే ప్రధానంగా దృష్టి సారిస్తోంది. దీంతో ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన అంశాల్లో పురోగతి కనిపిస్తున్నప్పటికీ ఎస్టీ వర్గీకరణపై మాత్రం కమిటీ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. దీంతో ఎస్టీ వర్గీకరణ అంశం కాస్త వెనకబడిపోయింది. అసెంబ్లీలో సీఎం ప్రకటన..: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేపట్టి రిజర్వేషన్లు అమలు చేసే అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆగస్టు ఒకటిన తీర్పు చెప్పడం తెలిసిందే. ఈ తీర్పు వెలువడిన వెంటనే దేశంలోకెల్లా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను అమలు చేసే మొదటి రాష్ట్రం తెలంగాణ అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఇప్ప టికే జారీ చేసిన ఉద్యోగ నియామక నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణను అమలు చేస్తామని స్పష్టం చేశా రు. ఇందులో భాగంగా గత నెల 12న రాష్ట్ర ప్రభు త్వం నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన వర్గీకరణ కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు, ఇందుకు అవసరమైన సూచనలను తమకు తెలియజేయాలని కమి టీని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

# మైలురాయిలాంటి సినిమా



దర్శకుడు ఈశ్వర్ కార్తీక్ ఈ కథని జంగిల్, రాబిట్, లయన్.. అంటూ చెప్పడం మొదలుపెట్టాడు. జంగిల్ బుక్ తీస్తున్నాడేమో నా వాయిస్ కోసం వచ్చాడని అనుకున్నా. తర్వాత అసలు కథ చెప్పాడు. స్టోరీ అదిరిపోయింది. ఇంత అద్భుతమైన కథ ఇచ్చిన ఈశ్వర్‌కి థ్యాంక్స్. చాలా క్లారిటీగా స్క్రిప్ట్ రాసుకున్నాడు. ఇందులో చాలా కొత్తగా కనిపిస్తా. నా కెరీర్‌కి ఇది మైలురాయిలా నిలిచే సినిమా.' అని హీరో సత్యదేవ్ నమ్మకం వెలిబుచ్చారు. సత్యదేవ్, కన్నడ నటుడు డాలీ ధనుంజయ్ లీడ్ రోల్స్ చేసిన సినిమా 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ఎస్.రెడ్డి, ఎస్.పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. అక్టోబర్ 31న సినిమా విడుదల కానుంది. సోమవారం హీరో నాని ఈ సినిమా టీజర్‌ని ఆన్‌లైన్‌లో లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్యదేవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన మంచు మనోజ్ చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. దర్శకుడు ఈశ్వర్ అంకితభావంతో చేసిన సినిమా ఇదని, ఆడియన్స్ మంచి సినిమా చూడబోతున్నారని నటుడు డాలీ ధనుంజయ చెప్పారు.



## దిష్టి తగులుతుందని చెప్పలేదు

గత ఏడాది జూన్‌లో తన ప్రియుడు జహీర్ ఇక్బాల్‌ని పెళ్లాడి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది బాలీవుడ్ అందాలభామ సోనాక్షి సిన్హా. తన తాజా ఇంటర్వ్యూలో తన ప్రేమ, పెళ్లి, వైవాహిక జీవితం గురించి ఆసక్తికరంగా మాట్లాడింది సోనాక్షి. 'పెళ్లికి ముందు ఏడేండ్లు మేం డేటింగ్‌లో ఉన్నాం. కానీ ప్రపంచానికి తెలీదు. మా బంధం మా వ్యక్తిగతం. ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం లేదని భావించాం. చెబితే ఏదిపడితే అది రాసేస్తారు. పైగా దిష్టి తగిలే అవకాశం ఉంది. అందుకే చెప్పలేదు. ఏడేండ్ల తర్వాత ఇద్దరం కలిసి పెళ్లి నిర్ణయం తీసుకున్నాం. పెళ్లి జీవితంలో మరపురాని ఘట్టం. అందుకే గుర్తుండిపోయేలా చేసుకోవాలనుకున్నాం. ముందు పెద్దల అంగీకారం తీసుకున్నాం. ఆత్మీయులు, మమ్మల్ని ప్రేమించేవాళ్ల సమక్షంలో సింపుల్‌గా సెలబ్రేట్ చేశాం. మా పెళ్లిలో హాజరైన అందరూ మమ్మల్ని ప్రేమించేవారే కావడం విశేషం. వారందరి దీవెనల వల్లే ఇప్పుడు భార్యాభర్తలుగా ప్రతి క్షణాన్నీ ఎంజాయ్ చేస్తున్నాం' అంటూ చెప్పుకొచ్చింది సోనాక్షి.

# వెయ్యి మందితో పాట



నాగచైతన్య హీరోగా నటిస్తున్న పాన్ ఇండియన్ సినిమా 'తండేల్' కోసం వెయ్యిమందితో ఓ పాటని చిత్రీకరించారు మేకర్స్. చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో సాయి పల్లవి హీరోయిన్. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ పతాకంపై 'బన్నీ' వాసు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శివరాత్రి నేపథ్యంలో వచ్చే ఓ పాటని వెయ్యి మంది జూనియర్ ఆర్టిస్టులు, డ్యాన్సర్స్‌పై చిత్రీకరించినట్లు చిత్రయూనిట్ పేర్కొని, ఆ పాటకు సంబంధించిన లుక్‌ని విడుదల చేసింది. "ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా డి.మత్స్యలేశం గ్రామంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతోన్న చిత్రం 'తండేల్'. ఇద్దరు ప్రేమికుల జీవితాల్లో జరిగిన సంఘటనలు, భావోద్వేగాలు చాలా గ్రిప్పింగ్‌గా ఫిక్షనల్ స్టోరీ కంటే థ్రిల్లింగ్‌గా ఉండబోతున్నాయి. శైవ క్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన పురాతన శివాలయం శ్రీకాకుళంలోని శ్రీ ముఖలింగం. అక్కడ జరిగే మహాశివరాత్రి ఉత్సవాల స్ఫూర్తితో ఈ పాటను చిత్రీకరించాం. దేవిశ్రీ ప్రసాద్ చక్కగా కంపోజ్ చేయగా, శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు" అని చిత్రబృందం పేర్కొంది.

## అలా అయితే ఐటమ్‌సాంగ్‌కి రెడీ: అనన్య పాండే

ఒకప్పుడు ఐటెంమ్ సాంగ్స్ అంటే.. వాటికోసం ప్రత్యేకంగా నర్తకీమణులుండేవారు. జయమాలిని, సిల్క్‌స్మిత, అనూరాధ.. ఇలా అనమాట. ఇప్పుడు ఆ బాధ్యతను కూడా స్టార్ హీరోయిన్లే మోసేస్తున్నారు. ఒక సినిమాలో హీరోయిన్‌గా చేస్తే ఎంత పారితోషికం ముడుతుందో.. ఒక్క పాటకు అంత పారితోషికం ఇస్తామంటే ఎవరు కాదంటారు చెప్పండి? ఐశ్వర్యరాయ్ దగ్గర్నుంచి శ్రియ, సమంత, కాజల్, తమన్నా రీసెంట్‌గా త్రిష.. ఇలా చాలామంది స్టార్ హీరోయిన్లు ఐటమ్ సాంగ్స్‌లో మెరిసిన వారే.

ఇప్పుడు ఈ లిస్ట్‌లో చేరడానికి బాలీవుడ్ భామ అనన్య పాండే కూడా సుముఖత వ్యక్తం చేస్తున్నది. ఇటీవల ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'ఐటమ్ సాంగ్స్‌లో చేయడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. కాకపోతే కథకు సంబంధం లేకుండా, కథ డిమాండ్ చేయకపోయినా కొందరు అనవసరంగా ఐటమ్ సాంగ్స్ పెడుతుంటారు. అలాంటి పాటల్లో నర్తించను, నటించను. నేను ఐటమ్ సాంగ్ చేస్తే అది కథలో ఉండాలి. కథ ఆ పాటను డిమాండ్ చేయాలి. అలాంటి పాట వస్తే తప్పకుండా ఐటమ్ సాంగ్ చేస్తా.' అని తెలిపింది అనన్య పాండే.



# నీలాంటివాడ్నే..!

"కళ్లజోడు తీస్తే నీలాంటివాడ్నే.. షర్ట్‌పైకి పెడితే నీలాంటివాడ్నే... టక్కు టై తీస్తే నీలాంటివాడ్నే...' అంటూ మొదలవుతుంది 'గేమ్ చేంజర్' సినిమాలోని 'రా మచ్చా మచ్చా' సాంగ్. హీరో రామ్‌చరణ్, దర్శకుడు శంకర్ కాంబినేషన్ లో రూపొందిన చిత్రం 'గేమ్‌చేంజర్'. కియారా అద్వానీ హీరోయిన్ . అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, 'దిల్' రాజు ప్రొడక్షన్స్పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ క్రిస్మస్‌కి విడుదల కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'రా మచ్చా మచ్చా..' పాట లిరికల్ వీడియోను సోమవారం సెయింట్ మార్టిన్స్ కాలేజ్‌లో విద్యార్థుల సమక్షంలో రిలీజ్ చేశారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఈ పాటను అజీజ్ పాడగా, తెలుగు వెర్షన్ కు అనంత శ్రీరామ్, తమిళంలో వివేక్, హిందీలో కుమార్ లిరిక్స్ రాశారు. గణేష్ ఆచార్య కొరియోగ్రఫీ అందించారు. 'రా మచ్చా మచ్చా..' పాట విడుదల కార్యక్రమంలో 'దిల్' రాజు, శంకర్, నటులు శ్రీకాంత్, ఎస్‌జే సూర్య, తమన్, అనంత శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. "ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, కర్ణాటక, వెస్ట్ బెంగాల్, జార?ండ్ రాష్ట్రాలకు చెందిన జానపద కళాకారులు ఈ పాటలో భాగమయ్యారు.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707